క్లుప్తంగా

నేడు అర్బన్‌హెల్త్ సెంటర్ ప్రారంభం

జమ్మలమడుగు : పట్టణంలోని కన్నెలూరు అర్బన్‌హెల్త్ సెంటర్ నూతన భవనంను సోమవారం ఉదయం పదిగంటలకు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మల చేతుల మీదుగా ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు.

ఘనంగా దండు మారెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



అమ్మ వారికి భోనాలు తెస్తున్న భక్తులు

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలం ఎం.కంబాలదిన్నె గ్రామంలో ఘనంగా దండు మారెమ్మతల్లి విగ్రహ ప్రతిష్టను నిర్వహించారు. ఆదివారం ఉదయం దేవస్థాన కమిటీ అధ్యక్షుడు శేగిరెడ్డి గంగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల పరిష్కారం



సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న ప్రజలు

ఎర్రగుంట్ల : మండలంలోని నిడుజివ్వి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులనుంచి వచ్చిన సమస్యలకు ఆయన పరిష్కార మార్గాన్ని చూపారు. రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వల్ల ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే అన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటి చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్టీపీపీలోని కమ్యూనిటీ హాల్‌లో ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఇంజనీర్లు, ఉద్యోగులు, పట్టభద్రులు, పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఓటరు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు పొన్న శివయ్య, ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట



నూతన ధ్వజస్తంభంను ప్రతిష్టిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు రెండు రోజుల నుంచి వివిధ అభిషేకాలు పూజలు, కలశ స్థాపనలు చేశారు. అనంతరం నూతన ధ్వజ స్తంభంను ప్రతిష్టించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలం వేపరాల గ్రామంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శిల్పారామంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శన

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు అలరించారు. ఖాజీపేట వరల్డ్ ఆఫ్ డ్యాన్స్ అకాడమి మాస్టర్ శివ బృందంచే జానపదం, వెస్ట్రన్ నృత్యప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

- రూ. 10 కోట్ల వ్యయంతో జాతీయస్థాయి ప్రమాణాలతో క్రీడామైదానం నిర్మాణం
- మార్చి నాటికి పనులు పూర్తి

క్రికెట్ స్టేడియం నిర్మాణం.. శరవేగం



పులివెందులలో చురుగ్గా సాగుతున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు



పులివెందులలో క్రికెట్ స్టేడియం నమూనా

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురం సమీపంలో రూ.10 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న వైఎస్సార్ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10 ఎకరాలలో వైఎస్సార్ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది ఫిబ్రవరిలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ స్టేడియం నిర్మాణ పనులను వీబీఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించారు. క్రికెట్ స్టేడియాలు నిర్మించడంలో సంస్థ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. స్టేడియం నిర్మాణ పనులు పూర్తైతే క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతోపాటు దేశ, రాష్ట్రస్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించేందుకు తీర్చిదిద్దుతున్నారు.

మార్చి నాటికి పనులు పూర్తి చేస్తాం



క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను ఈ ఏడాది మా ర్చి చివరి నాటికి పూర్తి చేసి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో కడప రిమ్స్ సమీపంలో వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం నిర్మించడం జరిగింది. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. – వీరభద్రారెడ్డి(క్రికెట్ స్టేడియం కాంట్రాక్టర్), పులివెందుల

అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమకు ముప్పు

జమ్మలమడుగు : కర్నాటకలో నిర్మిస్తున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమ ప్రాంత వాసులకు తీరని నష్టం జరుగుతుందని సీపీఎం నాయకుడు శివనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్నాటక ప్రాంతంలో ఎన్నికలు ఉండటంతో భద్ర ప్రాజెక్టు కోసం రూ.5300 కోట్లు బడ్జెట్ కేటాయించింది. ఎన్నికల్లో లబ్ధిపొందాలని ఈ పనిచేస్తోందన్నారు. తుంగ భద్ర ప్రాజెక్టుపైన రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం, కర్నూల్ ప్రాంతాలు ఎక్కువగా ఆధారపడి ఉన్నాయన్నారు. ఇప్పుడు తుంగ భద్రపై ప్రాజెక్టు నిర్మిస్తే సీమ వాసుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



సూర్యప్రభ వాహనంలో శ్రీరంగనాథస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ ధ్వజారోహణ చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అంతకముసుపు ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఆలయ ఈఓ వెంకటరమణ, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్‌లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని స్థానిక పూలంగళ్ల వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఉదయం స్వామివారికి సూర్యప్రభ అలంకరణ చేసి పురవీధులలో ఊరేగించారు. సాయంత్రం చంద్రప్రభ వాహన అలంకారం చేసి స్వామివారిని మరోమారు ఊరేగించారు. కార్యక్రమంలో శాశ్వత ఉదయదారులు మేడం దినేష్, నరసింహులుతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 6వ తేదీన సింహ వాహనం, 7వ తేదీన శేష వాహనం, 8వ తేదీన పగలు కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమద్వాహనం, 9వ తేదీన గరుడ వాహనం, 10వ తేదీన శ్రీరంగనాథ స్వామి కళ్యాణం, 11వ తేదీన బ్రహ్మ రథోత్సవం, 12న అశ్వ వాహనం, 13న హంస వాహనంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. స్థానిక పూలంగళ్ల వద్ద ఏర్పాటు చేసిన మండపంలో ప్రతి రోజు రాత్రి 7గంటల నుంచి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ ఈఓ తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సీతా రాములు

కమలాపురం : మండల పరిధిలోని టి.చదిపిరాళ్ల ఎస్సీ కాలనీలో నిర్మించిన శ్రీ సీతా రామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వాముల వారి ఆలయ వార్షికోత్సవ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అభిషేకాలు, కలశ స్థాపన, హోమాలు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం చల్లా సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కమనీయం చెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణం జరుపుతున్న వేద పండితులు

వల్లూరు : మండలంలోని పైడికాలువలో వెలసిన శ్రీరాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వాముల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఆలయ ప్రధాన పురోహితులు స్వామి హరినారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. అనంతరం స్వామివారి మూల మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్ఆర్‌సీపీ నేత సుదర్శన్‌రెడ్డి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం



గంధం ను ఊరేగిస్తున్న భక్తులు

కమలాపురం : మండల పరిధిలోని తురుకపల్లెలో వెలసిన శ్రీహజరత్ సయ్యద్ మహమ్మద్ షా స్వామి వారి ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామ ప్రజలు, దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారి ఉరుసు మహోత్సవంను వైభవంగా నిర్వహించారు. ప్రొద్దుటూరు, కమలాపురం తదితర ప్రాంతాలకు చెందిన స్వాముల పర్యవేక్షణలో గంధం తయారు చేశారు. వాటిని ప్రత్యేక బిందెలలో నింపి పూల మాలలతో అలంకరించి తలపై పెట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. స్వామి వారి జెండాలతో పాటు గంధం ఊరేగింపు మేళ తాళాలతో, డప్పు వాయిద్యాల నడుమ, బాణా సంచా పేల్చుతూ పుర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపు దర్గా చేరుకున్న అనంతరం జెండా చెట్టు వద్ద జెండాలను ప్రతిష్టించారు. స్వామి వారి మజార్‌పై గంధం ఎక్కించి పూలచాదర్లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన అశేష భక్తజనం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పాతెహా నిర్వహించారు.

ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు



ప్రత్యేక పూజలందుకుంటున్న కాశిరెడ్డినాయన

వీరపునాయునిపల్లె : మండలంలోని వేంపల్లె, యర్రగుంట్ల ప్రధాన రహదారిలోని పాలగిరి క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన ఆలయం, సంగాలపల్లెలోని శివకృష్ణ గోసంరక్షణశాల, సంగమేశ్వరస్వామి దేవస్థానంల నందు ఆదివారం మాఘ పౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాశిరెడ్డి నాయన ఆలయం, గోశాలలో నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

లింగాల : స్థానిక శ్రీఅవధూత కాశిరెడ్డి నాయన ఆలయంలో, కర్ణపాపాయపల్లె భూలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

వేంపల్లె : స్థానిక గౌరినగర్ వీధిలో వెలసిన శ్రీరాముని ఆలయంలో మాఘ పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షుడు ఎస్.కుళ్లాయప్ప, కటిక చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్థానిక శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఆలయ అర్చకులు ఎస్.ప్రసాద్ శర్మ నేతృత్వంలో నిర్వహించారు.

చెన్నూరు : స్థానిక పెన్నానది ఒడ్డున వెలిసిన ఆంజనేయపురం గ్రామంలో శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం వద్ద ఆదివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెన్నూరు, ఖాజీపేట మండలాలకు చెందిన 300 మంది దంపతులు స్వామి వారి వ్రతంలో పాల్గొన్నారు. వేద పండితులు గిరిస్వామి దంపతుల చేతుల మీదుగా సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి ఆలయంలో మూలమూర్తులకు సుప్రభాత సేవ, అభిషేక పూజలు నిర్వహించారు.

ఘనంగా షిర్డి సాయినాథునికి పాలాభిషేకం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో వెలసిన శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో ఆదివారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని బాబావారికి 108 బిందెల పాలాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త శ్రీరామసుబ్బయ్య దంపతులు ముందుగా బాబాకు పాలు తీసుకొని వచ్చి పాలాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం షిర్డిసాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి, మహా మంగళ హారతులు పట్టారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట



తొండూరు : మండల పరిధిలోని సంతకొవ్వూరు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఓబులేసుస్వామిల విగ్రహాల ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు విశ్వనాథ శాస్త్రి స్వామివార్లకు తదితర పూజలు నిర్వహించారు. ఈ ఆలయానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దేవదాయ శాఖ నుంచి రూ.22లక్షల నిధులు మంజూరు చేయించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి, మాజీ ఎంపీపీ గంగా నీలావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగిరెడ్డి, గంగరాజు, ఎంపీటీసీ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

వేంపల్లె : పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, డీఏ అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం వేంపల్లెలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకపోతే ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, మహేష్‌బాబు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, యూటీఎఫ్ నాయకులు వెంకటసుబ్బయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

8న మండల కన్వీనర్ల సమావేశం

కొండాపురం : ఈనెల 8న కొండాపురం మండల కేంద్రంలోని రాఘవేంద్ర కల్యాణ మండపంలో మండల కన్వీనర్ల, గృహ సారధుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మండల నాయకుడు రాజారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్



హాజరైన ఇంటర్, టెన్త్ విద్యార్థినులు, మాట్లాడుతున్న ప్రముఖ వ్యాఖ్యాత శివప్రసాద్‌రెడ్డి

తొండూరు : యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉంటుందని ప్రముఖ వ్యాఖ్యాత శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్, టెన్త్ విద్యార్థినులకు స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ తులశమ్మ అధ్యక్షతన పరీక్షలలో మానసిక ఒత్తిడిని జయించడం ఎలా అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాఖ్యాత శివప్రసాద్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ జీవితంలో ఎదగాలంటే ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం అనేది ఎంతో అవసరమని.. చదువు ఒక్కటే ఉంటే సరిపోదని.. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. కావున తల్లిదండ్రుల మాటలు కఠినంగా ఉన్నప్పటికీ జీవితంలో ఎదుగుదలకు అవే తొలిమెట్టుగా భావించి గురువులు నేర్పిన క్రమశిక్షణ, ఏకాగ్రతతో కూడిన విద్యనభ్యసిస్తే అవే ఉన్నత శిఖరాలకు పునాదులవుతాయన్నారు. దేశానికి యువత వెన్నముకలాంటివారని.. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నతమైన ఆశయాలతో ఉత్తమ పౌరులుగా నిలబడటంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక పాతమార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున లలితాదేవికి, శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్‌ను నూతన పట్టువస్త్రాలతో, వెండికవచాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన, లలితాసహస్రనామ పారాయణం చేశారు. పూజాకార్యక్రమ అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

- స్థానిక కొర్రపాడురోడ్డులోని మున్సిపల్ పెట్రోల్ బంకు సమీపంలో మాఘపౌర్ణమి సందర్భంగా శ్రీలక్ష్మీ కుబేర స్వర్ణాకర్షణ భైరవస్వామి ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీనివాసులస్వామి ఆధ్వర్యంలో 500 మంది పైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ట్రస్ట్ సభ్యులు నాని, సాయి, శివకుమార్, సుధీర్ పాల్గొన్నారు.
- స్థానిక టూటౌన్ సమీపంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించి పూలతో అలంకరించారు. సీమాంధ్రబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో నాయిబ్రహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు, చల్లారవి, సీతంపల్లె రమణ, నాగప్రసాద్, ఈశ్వరరెడ్డి, ఏసునాథరెడ్డి, నల్లం శంకర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ, శివపార్వతుల కల్యాణం



సీతారామ, శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దిగువబ్రాహ్మణ వీధిలో వెలసిన కాశీవిశ్వనాథస్వామి, కోదండరామ స్వామి, అభయాంజనేయస్వామి దేవస్థానం అష్టమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఒకే వేదికపై ఏక కాలంలో నిర్వహించిన శివపార్వతుల, సీతారామ కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవోపేతంగా నిర్వహించిన కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భారీ అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి పూలంగిసేవ, ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో మారుతిసేవాసమితి ట్రస్ట్, భజనమండలి సెక్రటరీ ఆవుల శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు చిట్టిస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో మాఘపౌర్ణమి సందర్భంగా సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. అలాగే గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా శనగ నూర్పిళ్లు



పెద్దముడియం మండలంలో శనగ పంటను కోస్తున్న కూలీలు



చిన్న మిషన్‌తో నూర్పిడి చేస్తున్న కూలీలు



శనగలు కోసి పొలంలో కుప్పలు వేసిన రైతులు

పెద్దముడియం : మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ పంట కోతకు రావడంతో నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 40,000 ఎకరాలలో శనగ పంటను సాగుచేశారు. కొందరు రైతులు కూలీల చేత శనగ పంటను కోయిస్తుండగా మరి కొందరు రైతులు కటింగ్ మిషన్‌ల ద్వారా పంటను నూర్పిడి చేస్తున్నారు. ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో శనగల ధర రూ.4,600 ఉండటంతో రైతులు ప్రభుత్వ మద్దతు ధర రూ.5,335కు విక్రయించడానికి స్థానికంగా ఉండే గోదాములలో నిల్వ చేసుకుంటున్నారు.

ఎర్రగుంట్ల మండలంలో..

ఎర్రగుంట్ల : మండల వ్యాప్తంగా సాగు చేసిన శనగ పంట కోత నూర్పుళ్లు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో సుమారు 11,750 ఎకరాలలో శనగ పంటను రైతులు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.కొన్ని చోట్ల ఎకరాకు 5 లేక 6 బస్తాలు మాత్రమే అయినట్లు రైతులు అంటున్నారు.